## క్లుప్తంగా

### ఆదర్శవంతం..టీచర్స్‌కాలనీ



**హన్మకొండ అర్బన్ :** పచ్చదనం, పరిశుభ్రత, క్రమశిక్షణ కార్యక్రమాల నిర్వహణ వంటి ఎన్నో అంశాల్లో ప్రగతిమిత్ర టీచర్స్‌కాలనీ ఫేజ్-1 డెవలప్‌మెంట్ కమిటీ ఆదర్శవంతంగా నిలుస్తుందని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి అన్నారు. సంక్రాంతి సందర్భంగా కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కాలనీ కమ్యూనిటీహాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు, డైరీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కడియం శ్రీహరి ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పి.రాంరెడ్డి, కార్యదర్శి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**హన్మకొండ :** హనుమకొండలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. న్యూ శాయంపేట జంక్షన్, పద్మాక్షి గుట్ట ప్రాంతంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయుడు

**కాజీపేట:** గ్రేటర్ పరిధిలోని 63వ డివిజన్ జూబ్లీమార్కెట్ ఆవరణలో కొలువుదీరిన దక్షిణ ముఖ అభయాంజనేయస్వామి ఆలయంలో సోమవారం కనుమ పండుగను పురస్కరించుకుని స్వామి వారికి ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి జాగర్లపూడి శ్రీనివాస్‌శర్మ స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరిపించి పూలు, తమలపాకులతో అలంకరించారు.

### బాధిత కుటుంబానికి చేయూత

**హసన్‌పర్తి :** ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ముచ్చర్లకు చెందిన దావ రాజు కుటుంబానికి బీఆర్‌ఎస్ నాయకుడు చల్లా వెంకటేశ్వర్ రెడ్డి చేయూతనందించారు. సోమవారం బాధిత కుటుంబానికి బియ్యంతోపాటు నిత్యావసర సరుకులు అందజేశారు. ఆయన వెంట స్థానికులు శ్రీధర్, రాజేష్, శ్రవణ్, రాజేష్, అనిల్, శ్రీనివాస్, భిక్షపతి తదితరులు ఉన్నారు.

### ఆర్థికసాయం అందజేత



**మడికొండ :** కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన జర్నలిస్టు చిర్ర మధు(33)కు తనతో చదువుకున్న పదవ తరగతి 97–98 సంవత్సరం చదివిన స్నేహితులు తమవంతుగా తోటి స్నేహితుడికి రూ.50వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను కుటుంబ సభ్యులకు అందజేశారు. అందజేసిన వారిలో స్నేహితులు సురేష్, చారి, ప్రసాద్, తదితరులు ఉన్నారు.

### రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**హసన్‌పర్తి:** గ్రేటర్ పరిధిలోని 55వ డివిజన్ రామారంలో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న నాలుగేళ్లల్లో ఎక్కువ మొత్తంలో నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.


### సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

**హసన్‌పర్తి:** 66వ డివిజన్ హసన్‌పర్తికి చెందిన బోడ సుజీత్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును సోమవారం అందజేశారు. అనారోగ్య కారణంతో వైద్యం కోసం సుజీత్ దరఖాస్తు చేసుకోగా రూ.27వేలు మంజూరయ్యాయి. ఈ చెక్కును మాజీ ఎంపీటీసీ, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్ అందించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు బోడ యుగంధర్, భాస్కర్, నాగరాజు,పవన్ తదితరులు పాల్గొన్నారు.

### వివాహానికి ప్రత్యేక పూజలు

**వరంగల్ చౌరస్తా :** వరంగల్‌లోని గోవిందరాజుల గుట్టపై గోదాదేవి తిరుకళ్యాణం అనంతరం ఆదివారం యువతీ, యువకుల వివాహం కోసం అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనతికాలం నుంచి ఆలయంలో ఔత్సాహికులైన యువతీ, యువకులు ఇక్కడ పూజలు చేస్తే సకాలంలో వివాహ సంబంధాలు త్వరగా అయి ఒక్కటవుతారని భక్తుల్లో నమ్మకం. అర్చకులు యువకులకు దండలు వేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాసస్వామి, సాయి మనోజ్, క్రాంతికుమార్, జగన్నాథం, లక్ష్మణ్, వేణుమాధవ్ పాల్గొన్నారు.

### నూతన కమిటీ ఎన్నిక



కార్తీక్

**హసన్‌పర్తి :** మున్నూరు కాపు సంఘం యువజన విభాగం గ్రామ కమిటీని మండల కేంద్రంలో సోమవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా బండా కార్తీక్, ప్రధాన కార్యదర్శిగా సాయిని రాకేష్, కోశాధికారిగా దేవేంద్రప్రసాద్, సహాయ కోశాధికారిగా రాంశెట్టి శ్రీకాంత్, సభ్యులుగా గంట మహేష్, సాయిని రాజేష్, శ్రీపాల్, నాగరాజు, వెంకటేశ్వర్లు, ఆకుతోట రాజేందర్‌లు ఎన్నికయ్యారు.

# కళాకారులకు ప్రభుత్వ అండ

- చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్



జ్యోతి ప్రజ్వలన చేసి కళోత్సవాలను ప్రారంభిస్తున్న వినయ్ భాస్కర్

**హన్మకొండ చౌరస్తా:** కళాకారులకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. జేబీ మా తెలంగాణ కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ 20వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వినయ్‌భాస్కర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కళోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కళాకారుల పాత్ర కీలకమైందన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు జడల శివహరిత దంపతుల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీనాగేశ్వరి కళాక్షేత్రం పద్మప్రియ శిష్యబృందం, శివాజీ మాస్టర్ బృందం శాస్త్రీయ నృత్యాలు, ఆర్కెస్ట్రా గాయకులు చంద్రశేఖర్, స్వప్న, కీర్తి, పత్రి కుమారస్వామి, రంగనాథ్, రాజ్‌కుమార్ ఆలపించిన పాటలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కళాభిమానులు, కళాకారులు సుమారు 300 మంది పాల్గొన్నారు.

# ఘనంగా గోదాదేవి కల్యాణం



కాజీపేట : కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

**కాజీపేట :** స్థానిక చైతన్యపురికాలనీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో గోదాదేవి, పద్మావతి సమేత శ్రీనివాసుల కల్యాణ వేడుకలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి రఘురామాచార్యులు, బ్రహ్మశ్రీ శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో పండితులు వివాహ మహోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్ కుమార్ గౌడ్, మేజర్ వడ్డెపల్లి నరేందర్‌తో పాటు కాలనీ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

**హన్మకొండ చౌరస్తా :** హనుమకొండ కాపువాడలోని శ్రీహనుమద్గిరి లక్ష్మి నరసింహస్వామి దేవాలయంలో ఆదివారం శ్రీగోదారంగనాథస్వామి కల్యాణ వేడుకలు కన్నుల వైభవంగా జరిగాయి. వేడుకల్లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై మహోత్సవాలను తిలకించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, 10 డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుమార్‌యాదవ్, సతీష్, రమేష్, రాజ్‌కుమార్, మనోజ్, రాజు, సుబ్రహ్మణ్యం, భిక్షపతి, చిరంజీవి, సంతోష్, వేణు, శ్రీను, పాల్గొన్నారు.

# సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



ఆటో అడ్డాను ప్రారంభిస్తున్న సీఐటీయూ జిల్లా నాయకులు

**వరంగల్ చౌరస్తా :** తెలంగాణ ఆటోఅండ్ ట్రాలీ వర్కర్స్ యూనియన్ పక్షాన మండిబజార్. చార్‌బౌళిలో ఆటో అడ్డాలను అదివారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామాస్వామి, అధ్యక్షుడు సాగర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ అడ్డాలమీద ఆటోకార్మికులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి భద్రతగా నిలిచి ప్యాసింజర్లను సురక్షితంగా వారి గమ్యాలకు చేరుకునే విధంగా ప్రయత్నం చేయాలన్నారు. వేలాదిమంది ఆటోకార్మికులు పెద్ద చదువులు చదువుకొని ఉద్యోగాలు లభించక పొట్టకూటి కోసం ఆటో నడుపుకుంటున్నారు. కార్మికులకు సంక్షేమ బోర్డు లేదని, ఫలితంగా ప్రమాదంలో జరిగినప్పుడు గాయపడిన అనారోగ్యపాలైనా ప్రభుత్వాల నుంచి ఎటువంటి సహాయం అందడం లేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆటో,ట్రాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ.మహబూబ్ పాషా, అడ్డా కమిటీ నాయకులు యాకుపాషా, అమీర్ పాషా, అన్వర్, అబ్దుల్, అశేఫ్, ఇఫ్రాన్, అమీర్ పాషా, ఖలీల్ , చిరంజీవి, సాబీర్ పాషా, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**సమస్యల పరిష్కారానికి కృషి**

**ఖిలా వరంగల్ :** కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ కృషి చేస్తుందని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి అన్నారు. వరంగల్ కరీమాబాద్ రోడ్డు శాకరాశికుంట సమీపంలోని ఎస్‌బీఐ సెంటర్‌లో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీఐటీయూ జెండాను సోమవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైల్వేగేట్ ఏరియాలో కార్మికులు పెద్ద ఎత్తున కేంద్రీకృతమై నివసిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గున్నాల ప్రభాకర్, సాజియా, రవీందర్, మల్లేశం, కిరణ్, యాకుపాషా, సదానందం, మహిబూబ్ పాషా, మురళి, రాజ్‌కుమార్, విశ్వనాథ్, గోపాల్, మహేష్, సలీమ్ పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**శోభన్‌బాబు విగ్రహం ఏర్పాటు చేస్తాం**




**ఖిలావరంగల్:** తెలుగు ప్రజల ఆరాధ్యనటుడు దివంగత శోభన్‌బాబు విగ్రహం ఓరుగల్లులో ఏర్పాటు చేస్తామని శోభన్‌బాబు సేవా సమితి ఫౌండర్ చైర్మన్ పి.వి. శేషేందర్‌రావు తెలిపారు. సోమవారం ఫోర్ట్‌రోడ్డు ఆర్టీఏ జంక్షన్ సమీపంలో వరంగల్ శోభన్‌బాబు సేవా సమితి ఆధ్వర్యంలో బండి వీరన్న, జక్కు విజయ్‌కుమార్ నేతృత్వంలో శోభన్‌బాబు 87వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శోభన్‌బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శోభన్‌బాబు జ్ఞాపికలను అభిమానులకు అందజేసి మహాన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.

**ముగ్గులు ఇంటింటా సం'క్రాంతి'**

**వరంగల్ చౌరస్తా :** మకర సంక్రాంతి పండుగను పురస్కరించుకొని సోమవారం వరంగల్ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో రామన్నపేటలో సంక్రాంతి లక్ష్మిని ఆహ్వానిస్తూ మహిళలు ముగ్గులు వేశారు. సుమారు 60 మంది మహిళలు ముగ్గులు పోటీ పడి వేశారు. క్లబ్ ప్రతినిధులు వాసుదేవులు, శైలజలు జడ్జిలుగా వ్యవహరించి విజేతలను ప్రకటించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు గుంటూరు వెంకటనారాయణ, కార్యదర్శి పల్లెర్ల వీరన్న, కోశాధికారి గన్ను సంపత్, ఆర్సీ వల్లాల పృథ్వీరాజ్, జెడ్సీ మెంబర్లు కిశోర్ పాల్గొన్నారు.

**మడికొండ :** గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46, 64వ డివిజన్లలో మడికొండ, ఉనికిచర్ల, టేకులగూడెం, రాంపూర్, తదితర గ్రామాల్లో సంక్రాంతి వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వివిధ గ్రామాల నుంచి కొత్తకొండ, ఐనవోలు, జాతరలకు ప్రజలు ఎడ్లబండ్లపై తరలివెళ్లారు.

**పోస్టర్ ఆవిష్కరణ**



**హన్మకొండ చౌరస్తా :** వరంగల్‌కు చెందిన దర్శకుడు కంజర్ల సందీప్ తెరకెక్కిస్తున్న 'భీం భీమికి జై' సినిమా వాల్‌పోస్టర్లను ఆదివారం పెద్దమ్మగడ్డలో మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటాల పురిటిగడ్డ తెలంగాణలో అనేక వీరగాధలు ఉన్నాయన్నారు. నిజజీవితంలో జరిగిన యధార్థ సంఘటనల ఆధారంగా రూపొందిన అనేక చిత్రాలు అంతర్జాతీయ స్థాయిలో నిలిచాయని అలాంటిదే ఈ చిత్రమన్నారు. కార్యక్రమంలో చిత్ర దర్శకుడు సందీప్, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

**విజేతలకు మెమొంటోలు ప్రదానం**



**ఖిలావరంగల్:** సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆదివారం వరంగల్ శంభునిపేట విశ్వనాథ కాలనీలో శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయ చైర్మన్ కర్నె రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు నగదుతోపాటు మెమొంటోలను అందజేసి అభినందించారు. ముఖ్య అతిథిగా కార్పొరేటర్ పోశాల పద్మ హాజరై మహిళలకు మెమొంటోలను అందజేశారు.


**మృతురాలి కుటుంబ సభ్యులకు పరామర్శ**

**కాజీపేట:** పట్టణంలో మృతి చెందిన బొడ్డు ఎల్లమ్మ మృతదేహాన్ని సోమవారం డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి వచ్చి పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు.

**కండ్లను కాపాడుకోవాలి**

**హసన్‌పర్తి:** కండ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అన్నారు. స్థానిక నేతాజీ పాఠశాలలో వాకర్స్ అసోసియేషన్, శరత్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరం సోమవారం నిర్వహించారు. 200 మందికి పరీక్షలు నిర్వహించారు.

**ఎడ్లబండి నడిపిన 'అరూరి'**



**హసన్‌పర్తి :** దేవన్నపేటకు చెందిన భక్తులు కొత్తకొండ వీరభద్రస్వామి జాతరకు ఆదివారం బయల్దేరారు. ఎమ్మెల్యే అరూరి రమేష్ గ్రామంలో భక్తులతో కొంతసేపు ముచ్చటించారు. అనంతరం ఎడ్లబండిని నడిపారు. ఆయన వెంట కార్పొరేటర్ సునీల్‌కుమార్, తదితరులు ఉన్నారు.

## దేశభక్తి గీతాలాపనపై శిక్షణ, పోటీలు

**హన్మకొండ చౌరస్తా:** వల్లంపట్ల ఆర్ట్స్ డెవలప్‌మెంట్, వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో దేశభక్తి–జాతీయ సమైక్యత గీతాలాపనపై శిక్షణ, పోటీలను నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించడం కోసం పాటల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 17 నుంచి 21 వరకు సాయంత్రం 6 నుంచి 7గంటల వరకు ఆన్‌లైన్‌లో జూమ్ ద్వారా శిక్షణ ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు యూత్ ఫర్ సేవా సంస్థ జూమ్ మీటింగ్ ఐడీ 869 1240 7168, పాస్‌వర్డ్ 841812 ద్వారా లాగిన్ కావొచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 94401 07543 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

## సేవచేసిన వారిని మరువరు

**హసన్‌పర్తి :** ఉత్తమమైన సేవలు అందించిన వారిని ప్రజలు మరువరని వక్తలు పేర్కొన్నారు. హసన్‌పర్తి ఏఈగా విధులు నిర్వహించి బదిలీ అయిన సంపత్ రెడ్డిని ఎన్పీడీసీఎల్ ఉద్యోగులు, కార్మికులు సోమవారం ఏఈ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మూడేళ్ల పాటు సంపత్‌రెడ్డి వినియోగదారులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించారన్నారు. కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ శ్రీనివాస్, ఏఐలు గోవర్ధన్‌రెడ్డి, రౌతు రమేష్‌కుమార్, లైన్‌మెన్ కుమార్, జేఎల్‌ఎంలు చంద్రమూర్తి, రాజ్‌కుమార్, శ్రీనివాస్, రాజు, రమేష్, వాజీద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ మీడియా కన్వీనర్‌గా విల్సన్ మాదిగ



**కాజీపేట:** మాదిగ రాజకీయ పోరాట సమితి ఉమ్మడి జిల్లా మీడియా కన్వీనర్‌గా కాజీపేట మండలం అయోధ్యపురం గ్రామానికి చెందిన జేరిపోతుల విల్సన్ మాదిగ ఎన్నికయ్యారు. జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బీఎస్ రమేష్ కుమార్ మాదిగ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కల వెంకటస్వామి మాదిగ కాజీపేటలో నియామక పత్రం అందజేశారు.

# ప్రమాదకరంగా కాజీపేట ఆర్‌ఓబీ

- ఏపుగా పెరుగుతున్న మొక్కలు
- గోడలపై ఏర్పడిన పగుళ్లు..
- పట్టించుకోని అధికారులు



బ్రిడ్జిపై పెరుగుతున్న మొక్క

**కాజీపేట :** కాజీపేట రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. వీటిని మొదట్లోనే తొలగించకపోవడంతో వేళ్లు విస్తరించి బ్రిడ్జి గోడలపై పగుళ్లు ఏర్పడి పెచ్చు లూడుతున్నాయి. బ్రిడ్జిపై చెట్లు ఎక్కువగా ఉన్నాయి. బ్రిడ్జిపొడవునా ఇరువైపులా ఏపుగా పెరుగుతున్న చెట్లు బాటసారులకు దర్శనమిస్తున్నాయి. వీటిని ఇలాగే వదిలేస్తే కోట్లాది రూపాయలతో నిర్మించిన బ్రిడ్జి క్రమేణా శిథిలావస్థకు చేరుకుంటుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్లు ఎదుగుతున్నా తొలగించడానికి ఎన్‌హెచ్ అధికారులు ప్రయత్నించకపోవడం విమర్శలకు తావిస్తోంది. నిత్యం ఇంజనీరింగ్ అధికారులు బ్రిడ్జిపై నుంచి రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకునే వారే లేరు. ఇప్పటికైనా ఎన్‌హెచ్ ఇంజనీరింగ్ అధికారులు స్పందించి వెంటనే చెట్లు తొలగించడానికి చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# రామాలయంలో ఘనంగా పూజలు



పండ్లు, గాజులు, పూలబండికి శాస్త్రోక్తంగా పూజలు చేస్తున్న మహిళలు

**ఖిలావరంగల్:** వరంగల్ శివనగర్‌లోని శ్రీసీతా రామచంద్రస్వామి దేవాలయంలో శ్రీసీతారామచంద్రస్వామి, శ్రీలలితాదేవి అమ్మవార్లకు ఘనంగా పూజలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం ఆలయ ప్రధాన పూజారి వెంకటేశ్వర్లు చార్యులు ఆధ్వర్యంలో ఓరుగంటి విమల, మంచాల రాణి నేతృత్వంలో శాస్త్రోక్తంగా పంచవటిక నోములు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు పెద్ద ఎత్తున మంగళహారతులతో చేరుకున్నారు. శ్రీలలితాదేవి అమ్మవారికి 108 చీరలను సమర్పించి 108 కిలోల బియ్యం, చక్కర, నువ్వులు, పసుపు, కుంకుమ సమర్పించారు. అనంతరం గాజులు, పండ్లు, పూల బండ్లను ఏర్పాటు చేసి మహిళలు మంగళహారుతులో పూజలు చేపట్టారు. నిర్వహణ కమిటీ ప్రతినిధులు భక్తులకు తీర్థప్రసాదంగా గాజులు, పండ్లు, పూలు అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో మంచాల కృష్ణమూర్తి, రావికంటి అశోక్, శ్రీదేవి, శైలజ పాల్గొన్నారు.

# పేదోళ్ల రైలును పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

**న్యూశాయంపేట :** వందేభారత్ రైలు పెద్దోళ్ల రైలు అని పేదోళ్ల రైలు అయిన పుష్‌పుల్‌ను వెంటనే పునరుద్ధరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా సమితి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వందేభారత్ రైలుతో రాజకీయాలు తగవన్నారు. గతంలో ఎన్నడూ రైళ్ల ప్రారంభించనట్టుగా ఇప్పుడే పట్టాల మీద కాకుండా గాలిలో తేలియాడినట్టు పయనించినట్టు బీజేపీ, బీఆర్‌ఎస్‌లు నానా హంగామా చేస్తున్నారని ఎద్దేవా చేశారు. దేశం పేరు చెప్పి ధరలు పెంచి పేదలపై భారం మోపుతున్నాయన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, ఎల్లేశ్, అదిరి శ్రీనివాస్, సదాలక్ష్మి, ఉట్కూరి రాములు, దుప్పటి సాంబయ్య కర్రె లక్ష్మణ్, ఓదేలు, రమాదేవి పాల్గొన్నారు.

# బాధితుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



హసన్‌పర్తి : సీఈని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

**హసన్‌పర్తి :** నీటిపారుదలశాఖ వరంగల్ సర్కిల్ చీఫ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న సుధాకర్‌రెడ్డిని ఆదివారం ఎమ్మెల్యే అరూరి రమేష్ పరామర్శించారు. ఇటీవల సుధాకర్‌రెడ్డి సతీమణి పద్మ మృతి చెందగా సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే నయింనగర్‌లోని సుధాకర్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్ ఉన్నారు.

**మడికొండ:** కాజీపేట మండలం టేకులగూడెం గ్రామానికి చెందిన మావోయిస్టు పార్టీ సభ్యుడు మాచర్ల ఏసోబు భార్య లక్ష్మి(60) అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట దర్గా సొసైటీ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి, పోలెపల్లి రామ్మూర్తి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## క్రైం న్యూస్

**చికిత్స పొందుతూ యువకుడి మృతి**



**ఖిలావరంగల్ :** వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఇటీవల ప్రమాదవశాత్తు కాలు జారి రైలు కింద పడి తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్సై పరుశరాములు తెలిపారు. రాజస్థాన్ రాష్ట్రం సర్తాల జిల్లా మండలం లుహారో కావాస్‌కు చెందిన అశోక్‌కుమార్ (28) విజయవాడలో నాగిని శ్రీమొబైల్ షాపు ఏర్పాటు చేశాడు. అశోక్‌కుమార్ రాజస్థాన్‌కు వెళ్లేందుకు ఈనెల 13న నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ నుంచి బయల్దేరాడు. వరంగల్ రైల్వేస్టేషన్‌లో ట్రెన్ ఆగగానే అశోక్‌కుమార్ టిఫిన్, వాటర్ బాటిల్ తీసుకుని ట్రెన్ ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారీ ప్లాట్‌ఫాం, ట్రెన్ మధ్య పడిపోయాడు. జీఆర్పి అధికారులు క్షతగాత్రున్ని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం బంధువులు ఏకశిల ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. బంధువుల అభ్యర్థన, ఎస్‌ఎస్ రైల్వే వరంగల్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

**విద్యుత్ షాక్‌తో చిన్నారికి గాయాలు**

**హన్మకొండ చౌరస్తా:** ఇంటిపై ఆడుకుంటున్న చిన్నారి విద్యుత్ షాక్‌కు గురై ప్రాణాపాయ స్థితిలో ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటన సోమవారం హనుమకొండలోని మచిలీబజార్‌లో చోటుచేసుకుంది. చిన్నారి తండ్రి మహ్మద్ బియాబాని తెలిపిన ప్రకారం.. బియాబాని కుటుంబం సుమారు పదేళ్లుగా మచిలీబజార్‌లోని మాజీ కార్పొరేటర్ ఉడుతుల సారంగపాణి ఇంట్లో అద్దెకు ఉంటుంది. సంక్రాంతి సెలవులు కావడంతో లష్కర్‌బజార్‌లోని ఎల్‌బీహెచ్‌ఎస్‌లో తన పెద్ద కూతురు సన, మరో కూతురు, కుమారుడు ముగ్గురు కలిసి ఇంటి డాబాపై ఆడుకుంటున్నారు. దారాన్ని పెన్నుకు చుట్టి పైకి ఎగిరేసే క్రమంలో ఇంటికి ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభం తీగలకు చుట్టుకుంది. సన అక్కడే ఉన్న ఇనుప రాడ్‌తో పెన్నును తీసే ప్రయత్నం చేసింది. దీంతో ఆమెకు విద్యుత్ షాక్ తగిలింది. చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ పాపకు మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఫోన్ చేసి ఆదేశించారు.

**అదృశ్యం కేసును ఛేదించిన పోలీసులు**


**వరంగల్ రూరల్ :** వరంగల్ ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏనుమాములకు చెందిన మైనర్ బాలిక అదృశ్యం కేసును పోలీసులు ఛేదించారు. ఏనుమాములకు చెందిన 19 ఏళ్ల అబ్బాయి, 17 ఏళ్ల మైనర్ బాలికతో జనవరి 1న అదృశ్యమైనట్లు కేసు నమోదైంది. స్థానిక సీఐ వి.చేరాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 1న 19 ఏళ్ల అబ్బాయి, 17 ఏళ్ల అమ్మాయి వారి ఇళ్లల్లో నుంచి బయటకు వెళ్లారు. తాము వివాహం చేసుకొని ఒక్కటయ్యామని మైనర్ బాలిక సోమవారం ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. దీంతో సీఐ కేసును దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని సీఐ చెప్పారు.

**యువకుడి అదృశ్యం**



**కాజీపేట:** ఇంటి నుంచి బయటకు వెళ్లిన తమ కుమారుడు నాలుగు రోజులవుతున్నా ఇంటికి రాలేదని ఓ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేటలోని అంబేడ్కర్‌నగర్ కాలనీకి చెందిన పోగుల వినయ్ (21)ఈనెల 13న బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. తండ్రి బంధుమిత్రుల ఇళ్లలో ఆచూకీ కోసం ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో రాజు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. యువకుడి ఆచూకీ తెలిసిన వారు 87126–85008, 87126–85122 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

**గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం**



**రామన్నపేట :** వరంగల్‌లోని కాకతీయ కెనాల్ డాక్టర్స్ కాలనీ–2 వద్ద సోమవారం గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు మట్టెవాడ సీఐ రమేశ్ తెలిపారు. మృతురాలు బ్లూ కలర్ జాకెట్‌పై చిన్న తెల్లని చుక్కలు, బ్లూ కలర్ చీరపై తెలుపు రంగు పూలడిజైన్ ఉన్నట్లు తెలిపారు. కుడి చేతికి నశం రంగు గాజులు 3, ఎడమ చేతికి మూడు గాజులు ఉన్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని ఎంజీఎం మార్చరీలో భద్రపరిచామని ఆచూకీ తెలిసిన వారు 8712685005, 8712685771, 7901137682 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

# జోరుగా పతంగుల విక్రయాలు



**కాజీపేట :** సంక్రాంతి పండుగ వచ్చిందంటే ఆకాశంలో రంగురంగుల గాలిపటాలు కనువిందు చేస్తుంటాయి. చిన్న, పెద్ద తేడా లేకుండా గాలిపటాలను ఎగురవేస్తున్నారు. పట్టణంతో పాటు శివారు గ్రామాల్లో యువకులు పోటీ పడి గాలిపటాలను ఎగురవేస్తున్నారు. వ్యాపారులు పిల్లల ఆసక్తికి అనుగుణంగా గాలిపటాలను తయారు చేసి విక్రయిస్తుండడం విశేషం. ఈ ఏడాది సినిహీరోలు, క్రికెట్ ఆటగాళ్లు, రాజకీయ నాయకుల గాలిపటాలకు మంచి డిమాండ్ ఉందని వ్యాపారులు చెబుతున్నారు. భోగి పండుగ రోజే 24వేల విలువైన పతంగులను విక్రయించినట్లు శ్రీనివాస్ వ్యాపారి 'సాక్షి'తో అన్నారు. పండుగ ముగిసిన మరో 15 రోజులపాటు విక్రయాలు సాగుతాయన్నారు.